క్లుప్తంగా

ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలి



ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు

కదిరి అర్బన్: తమకు ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని కదిరి ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు బుధవారం ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో ఆర్టీసీ ఉద్యోగుల పరిరక్షణ కోసం అప్పటి ప్రభుత్వం జీఓ 19 జారీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ అమలు చేస్తే ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో పని చేస్తారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఇవ్వాలని, ఆర్టీసీలో ఉన్న స్కీంలను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు రామక్రిష్ణ, ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, బయారెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్: పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కదిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. ఈ నెల 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తనకల్లు: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆదర్శ రూరల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సొసైటీ కార్యదర్శి శివానంద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు బ్యాంకుల సేవలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్‌బీఐ, సొసైటీ బ్యాంకులలో అతి తక్కువ వడ్డీలకు వివిధ రకాల రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయా బ్యాంకులలో అందుతున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: యర్రదొడ్డి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతూ ప్రతిభ కనబరచిన ఎనిమిది విద్యార్థులకు తన తండ్రి సీతారామిరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు బహుమతులను బుధవారం అందజేశారు. నగదుతో పాటు పాటు స్వీట్లు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

'పరిష్కార వేదిక'లో అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

తలుపుల : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. వివిధ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. ఇందులో ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై 45, పంచాయతీరాజ్ విభాగం కింద 32, హౌసింగ్ సమస్యలపై 13, పోలీసు కేసులకు సంబంధించి 3, ఐసీడీఎస్ ఒకటి ఉన్నాయి. ఈ సమస్యలను ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

రేపు వారపు సంత వేలం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో వారపు సంత, ఆర్టీసీ బస్టాండ్‌కు సంబంధించి సర్పంచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఈ నెల నాలుగో తేదీన పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సాదిక్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

గడ్డికి గడ్డుకాలం

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి పంటలు సరిగా పండలేదు. రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీనికితోడు ఈ వేసవిలో పశువుల మేతకు గడ్డుకాలం ఏర్పడింది. ఎండుగడ్డి కొరత నేపథ్యంలో పాడిరైతులకు పశుపోషణ భారమైంది.

- రైతులకు తప్పని కష్టాలు
- పాడిపశువులకు గ్రాసం కొరత
- గ్రాసం ధరల రెట్టింపుతో పోషణభారం



వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్



పాడి పశువులు

తలుపుల: వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమ రైతులను ఆదుకుంటోంది. మండలంలో 17 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో దాదాపు పది వేల కుటుంబాలు 14,500 పాడి పశువుల ద్వారా జీవనం సాగిస్తున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వచ్చే వరిగడ్డి, వేరుశనగ కట్టెను పశువులకు గ్రాసంగా వినియోగిస్తుంటారు. వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు కూలీల కొరత వల్ల మిషన్లతో కోయించడం, విడిపించడంతో పశుగ్రాసం వృథా అవుతోంది. ఇంకొందరు రైతులు పంట కోసిన తర్వాత కాల్చేస్తున్నారు. గతంలో అన్ని గ్రామాల్లో వరి సాగు చేయడంతో వరిగడ్డి పుష్కలంగా లభించేది. నేడు వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం తగ్గడంతో వరిగడ్డి కొరత ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో అరకొర వరి సాగు చేయగా, మరికొన్ని కొన్ని గ్రామాల్లో వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు. ఈ మండలంలోని పాడి రైతులు ఇతర జిల్లాలు, మండలాల నుంచి లారీలు, ట్రాక్టర్లతో గ్రాసం తెచ్చుకొంటున్నారు. వరిగడ్డి కొరత నేపథ్యంలో ధరలు అమాంతం పెరిగిపోయాయి. పాడి రైతులు వరిగడ్డి కొనలేక పచ్చిమేత, మొక్క జొన్న చొప్ప మీద ఆధారపడుతున్నారు.

దాణా ధరలూ భారీగా పెంపు

వరిగడ్డి, వేరుశనగ కట్టె ధరలు ఈ సీజన్‌లో రెట్టింపు పలుకుతున్నాయి. గతంలో ట్రాక్టర్ వరి గడ్డి రూ.4 వేల నుంచి రూ.6 వేలు ఉండేది. ప్రస్తుతం ట్రాక్టర్ వరిగడ్డి రూ.14 వేల నుంచి రూ.18 వేలు పలుకుతోంది. వేరుశనగ కట్టె ట్రాక్టర్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది. దీంతో పశుపోషణ కష్టంగా మారింది. పాడి రైతులు వరి గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో మొక్క జొన్న చొప్ప, పశుగ్రాసాలతో పాటు, దాణాలు వాడుతున్నారు. మార్కెట్‌లో పశువుల దాణా, శనగ చెక్క, బిస్కెట్, తవుడు రేట్లు విపరీతంగా పెరిగాయి. గతంలో రూ.900 ఉన్న 50 కిలోల పశుదాణా బస్తా ప్రస్తుతం రూ.1,300కు చేరింది. ఇదివరకు పశుసంవర్ధక శాఖ వారు గడ్డివిత్తనాలు, దాణా ఉచితంగా, సైలేజ్ గడ్డి సబ్సిడీపై ఇచ్చేవారు. ప్రస్తుతం కొంత మందికి దాణా సబ్సిడీపై అందజేసి చేతులు దులుపుకొన్నారు.

కొనలేని పరిస్థితి



పాడి పశువులకు ఎండు గడ్డి తప్పనిసరిగా ఒక మేత వేయాలి. వరి గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో పచ్చిమేతతో పాటు దాణాలు వాడుతున్నా. పాల దిగుబడి కోసం అప్పు చేసైనా ఎండుగడ్డి కొని ఒక మేత వేయాల్సివస్తోంది.

– సదాశివరెడ్డి, పాడి రైతు, ఉబ్బరవాండ్లపల్లి

భారంగా పశు పోషణ



కూలీల కొరత కారణంగా వరిగడ్డికి భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, జొన్నచొప్ప పచ్చి మేతతో పాటు ఇతర గ్రాసాలను పశువులకు మేతగా వేస్తున్నాం. ప్రస్తుతం దాణా రేట్లు విపరీతంగా పెరగడంతో పశుపోషణ పాడి రైతులకు భారంగా మారింది.

– శివారెడ్డి, పాడి రైతు, టి.రెడ్డి వారిపల్లి

ఇండెంట్ పెట్టాం



మండలంలో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగిన దృష్ట్యా 200 క్వింటాళ్ల జొన్నలు, 200 టన్నుల సైలేజ్‌గడ్డి, 100 టన్నుల దాణా ఇండెంట్ పెట్టాం. మంజూరు కాగానే రైతులకు అందజేస్తాం.

– నారాయణస్వామి నాయక్, పశువైద్యాధికారి, తలుపుల

రాష్ట్ర వాల్మీకి యూత్ కన్వీనర్‌గా శ్రీనివాసులు



రామగిరి: రాష్ట్ర వాల్మీకి యూత్ కన్వీనర్‌గా మండలానికి చెందిన శ్రీనివాసులును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాడతామన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అంజలి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించకుండా మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా ముగించేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అంజలి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు, శాఖల వారీగా చేసిన ప్రగతి నివేదికలు అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆయా శాఖల అధికారులు తెలియజేయాల్సి ఉంది. అయితే అధికారులు చెప్పిన వాటిని సభ్యులు వినడం మినహా కనీసం వాటిపై అధికారులను ప్రశ్నించపోవడంతో ఈ సమావేశం కేవలం గంటలోపే ముగిసింది. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్‌కుమార్ నాయక్, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రిటైర్డు పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



రిటైరైన వారిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రిటైర్డు అయిన కదిరి అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్‌ఐ రమణారెడ్డి, హిందూపురం ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ జైపాల్‌కు బుధవారం పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ రత్న ముఖ్య అతిథిగా హాజరై రిటైరైన వారిని సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఏఓ సుజాత, ఆర్‌ఐ మహేష్, ఆర్‌ఎస్‌ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ సర్వస్వతి తదితరులు పాల్గొన్నారు.

30న 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని బీపీఎల్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 30న రాత్రి 8 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను 'సంఘం శరణం గచ్ఛామి' అనే నాటిక ద్వారా ప్రదర్శిస్తున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళా బృందంచే అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన పెంచుకోండి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆటిజంపై అవగాహన పెంచుకొని మానసికంగా ఎదుగుదల లేని చిన్నారులను కాపాడుకోవాలని సీహెచ్ఓ నగేష్ సూచించారు. పట్టణంలోని ఎనుములపల్లి సచివాలయంలో ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరాజికల్ డిజార్డర్ కలిగిన చిన్నారులను ఇబ్బంది పెట్టరాదన్నారు. గర్భిణులు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సరైన సమయంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండ వేడి అధికగా ఉందని, వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పరిమళ, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళిక తయారీపై శిక్షణ



లేపాక్షి: సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా సభ్యులు, అధికారులు

అమరాపురం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం వార్షిక ప్రణాళిక, జీవనోపాదుల ప్రణాళికపై ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు, మహిళా సంఘాల లీడర్లకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సీసీ నాగరాజు మాట్లాడుతూ వార్షిక ప్రణాళికను ఏవిధంగా తయారు చేసుకోవాలి, జీవనోపాధులను మెరుగు పరచడం ఎలా చేయాలి అనే అంశాలపై వివరించారు. ప్రతి గ్రామంలో ఐదు నుంచి ఆరు మంది సభ్యులను ఎంపిక చేసుకొని వారికి సర్వే యాప్ ఏవిధంగా చేయాలి, తదితర వాటిని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎఫ్‌పీఓ లక్ష్మీనరసప్ప, సీసీలు వీఓఏలు, పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన వెలుగు కార్యాలయంలో బుధవారం సాయంత్రం డ్వాక్రా సంఘాల సభ్యులకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై ఏరియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, ఏపీఎం జయచంద్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు హరికృష్ణారెడ్డి లక్ష్మీపతి, రత్నమ్మ, పార్వతమ్మ, క్రిష్ణమూర్తి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సారాను సమూలంగా నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగాధర్

గుడిబండ: నాటుసారాను సమూలంగా నిర్మూలించి భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని ఎంపీడీఓ గంగాదర్ అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం-2 కార్యక్రమం నిర్వహించి నాటు సారా నిర్మూలనపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంగాధర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నాటు సారా తయారు చేసేవారు, తయారీకి సహరించిన వారిపై పీడీయాక్టు అమలు చేయాలని అధికారులకు సూచించారు. నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్తు తరాలు నష్టపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, ఏఎస్‌ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



పుట్టపర్తిలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎన్‌ఎంయూ నాయకులు, కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిపో ఎదుట నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని, సిక్ లీవ్ పెడితే జీతం ఇవ్వాలని, గతంలో మాదిరి నైట్ అవుట్ అలవెన్సులను ఇవ్వాలని కోరారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని, విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యత ఆర్టీసీ సిబ్బందికి ఇవ్వాలని, అన్ని గ్యారేజీల్లో సమస్యలు పరిష్కరించాలని, మహిళా ఉగ్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా రీజనల్ అధక్షులు శ్రీరాంనాయక్, కార్యదర్శి షబ్బీర్, ఉపాధక్షులు తిరుపతమ్మ, డిపో చీఫ్ అడ్వైజర్ అప్పిరెడ్డి, ప్రెసిడెంట్ శివశంకర్, కార్యదర్శి గంగులయ్య, ట్రెజరర్ శివారెడ్డి, జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, నాయకులు జనార్దన్, స్వర్ణమ్మ, చంద్ర, నాగరాజు, రవిత, మానస, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తేయండి

ముదిగుబ్బ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థి చేసిన తప్పిదానికి ఎస్‌జీ టీచర్ మహమ్మద్ రఫీపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని మండలంలోని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ ఎత్తి వేసి.. తన విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయానికి చైర్లు, టేబుళ్ల వితరణ

రొళ్ల: కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు చైర్లు, టేబుళ్ల వితరణ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకుని కార్యాలయానికి 40 ఫైబర్ చైర్లు, రెండు ఎస్ చైర్లతో పాటు ఆరు టేబుళ్లను అందజేశారు. గోవిందరాజును తహసీల్దార్ షేక్షావలి, సిబ్బంది అభినందించారు.

ముస్లింల నిరసన

హిందూపురం టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఎస్‌డీపీఐ హిందూపురం అసెంబ్లీ అధ్యక్షుడు ఇమ్రాన్, కార్యదర్శి అంజాద్ అలీలు మాట్లాడుతూ ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఆమోదం కోసం చట్టం చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తున్నామన్నారు.

అవిశ్వాస తీర్మానం పెట్టాలని వినతి

ప్రశాంతి నిలయం: కదిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ చేతన్‌ను కోరారు. ఈ మేరకు 24 మంది కౌన్సిలర్లు సంతకాల చేసిన ప్రతులను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి అందజేశారు. వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి మంగళవారమే తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

మారెమ్మ ఆలయంలో చోరీ

బొమ్మనహాళ్: హరేసముద్రం మారెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదును ఎత్తుకుపోయారు. ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్నారులకు టీకాలు

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రితో పాటు నార్సింపల్లి, ఎం. అగ్రహారం, కునుకుంట్ల, పిన్నదరి, పెద్దకోట్ల, దాడితోట తదితర గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం ఐదేళ్లలోపు చిన్నారులకు రోటా, పెంటా, ఓపీవీ, ఐపీవీ, పీసీవి, హెపటైటిస్‌బీ తదితర టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కోమలి, క్రిష్ణమ్మ, సుగుణ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్దన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల తనిఖీ



టీకాలు వేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలి కాలనీ, మూర్తిపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ తిప్పయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్దకు వెళ్లి అనుమానితులకు టీకాలు వేయించారు. టీకా వేసిన చోట వాపు వస్తే పాజిటివ్ అని, వారికి మందులు ఇవ్వాలని, నెగిటివ్ వస్తే వారికి ప్రివెంటివ్ మెడిసిన్ ఇవ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జున, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, మురళీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పద్మావతి, ఆశలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో అనారోగ్యం

ధర్మవరం రూరల్: నాటుసారా సేవించి అనారోగ్యానికి గురికావొద్దని ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం నేలకోట తండాలో గ్రామ సభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతు గ్రామాలలో గొడవలకు దూరంగా ఉండాలన్నారు. మద్యానికి బానిస కావద్దని సూచించారు. గ్రామంలో ఏవైనా సమస్యలను ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తండాలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కొత్త నిడిమామిడిలో పాఠశాల కొనసాగించాలి

పుట్టపర్తి అర్బన్: కొత్త నిడిమామిడిలో ఉన్న ఎస్సీ విద్యార్థులకు అదే గ్రామంలోని పాఠశాలను కొనసాగించాలని ఎంఈఓ అబ్దుల్ ఖాదర్‌కు డీవీఎంసీ సభ్యులు పైపల్లి గంగాధర్, రామాంజనేయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం 14 మంది ఎస్సీ కాలనీ విద్యార్థులు పాత నిడిమామిడిలో ఉన్న పాఠశాలకు వెళ్తున్నారని, ఇది సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉందని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

నోటి శుభ్రత పాటించాలి

రొళ్ల: గ్రామీణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సీహెచ్‌సీ డాక్టర్ బాలప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ బాలప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ నోటికి సంబంధించిన వ్యాధులు రాకుండా ఉదయం, సాయంత్రం వేళ్లలో తప్పని సరిగా బ్రష్ చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా సల్లాపురమ్మ పార్వేట



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



సల్లపూరమ్మ దేవతను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తున్న దృశ్యం



అలంకరణలో సల్లాపురమ్మ దేవత

రాప్తాడు: ఎం.బండమీదపల్లిలో సల్లాపురమ్మ జాతరలో భాగంగా బుధవారం పార్వేట నిర్వహించారు. ఉదయం సల్లాపురమ్మ దేవతను గ్రామంలోకి తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. యువతులు, మహిళలుబోనాలను తలపై పెట్టుకుని డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. గ్రామాన్ని చల్లగా చూడాలంటూ బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరలను కానుకలుగా సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని డప్పు, వాయిద్యాల నడుమ చెరువు వద్ద ఉన్న సల్లాపురమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేపట్టారు. భక్తులు గుడి చుట్టూ పన్నారపు బండ్లు తిప్పుతూ సందడి చేశారు. సాయంత్రం కుందేళ్లను వదిలి వాటిని వేటాడి (పార్వేట) చంపారు. యువత టెంకాయలు, చీనీకాయలు, నిమ్మకాయలను విసరడం లాంటి పందేలు ఆడారు. ఆలయ ప్రాంగణం భక్తులు, అంగళ్లతో కళకళలాడింది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.